విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

99492 22450

ప్రభాత సూర్య

www.suryaa.news



# ప్రభాత సూర్య

PRABHATA SURYA

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

హైదరాబాద్

4-5-2026

వెల: రూ.5/-

పేజీలు: 8

సంపుటి: 01

సంచిక: 235

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## కరీంనగర్ లో దొంగల బీభత్సం...

కొన్ని నిమిషాల ముందు తాను అదే ప్రాంతంలో ఉన్నానన్న బండి సంజయ్

కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలర్స్‌లో కాల్పుల ఘటన

దోపిడీ యత్నాన్ని అడ్డుకోవడంతో సిబ్బందిపై దుండగుల దాడి

ఈ ఘటనలో సేల్స్ మేనేజర్ సహా పలువురు ఉద్యోగులకు గాయాలు

ఘటనపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి

2,3లో

## అందరి చూపు బెంగాల్ పైనే!

పశ్చిమ బెంగాల్ సహా తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో నేడే కౌంటింగ్

ఏర్పాట్లు పూర్తిచేసిన ఎన్నికల సంఘం

అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత

కౌంటింగ్ సిబ్బందికి తొలిసారిగా క్యూఆర్ కోడ్ ఐడీ కార్డులు

అనధికార వ్యక్తులను నిరోధించడానికి పటిష్టమైన చర్యలు

తొలుత పోస్టల్ బ్యాలెట్లు.. తర్వాత ఈవీఎంల లెక్కింపు



## చెవిరెడ్డి ఔట్





### సజ్జల రామకృష్ణారెడ్డి రీఎంట్రీ

పక్కా ఆధారాలతో భాస్కర్ రెడ్డిని బుక్ చేసిన సజ్జల

తాడేపల్లి లో విభేదాలు పతాక స్థాయికి

తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో విభేదాలు పతాక స్థాయికి చేరినట్లు ప్రచారం నడుస్తోంది. గత కొంతకాలంగా సజ్జల రామకృష్ణారెడ్డి పెద్దగా కనిపించలేదు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నీ తానై కనిపించేవారు. కానీ ఇప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డి మళ్ళీ తెరపైకి వచ్చారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కనిపించకుండా మానేశారు. దీంతో ఏదో జరిగిందన్న అనుమానం పెరుగుతోంది. వైసీపీలోనే రకరకాల ప్రచారం నడుస్తోంది.

**ప్రభాత సూర్య ఏపీ బ్యూరో:** ముఖ్యంగా సజ్జల వర్సెస్ చెవిరెడ్డి అన్నట్టు పరిస్థితి ఉంది. ప్రస్తుతానికి అయితే సజ్జల రామకృష్ణారెడ్డి పై చేయి సాధించినట్లు సమాచారం.

**సజ్జల సైడ్..**

మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. అయితే అందుకు సజ్జల తీరే కారణమని కొంతమంది సీనియర్లు ఆరోపించారు.

- మిగతా 2వ పేజీలో



## లోక్సభ డిప్యూటీ స్పీకర్‌గా చిన్నమ్మ!

### పురందేశ్వరికి అరుదైన ఛాన్స్

- చంద్రబాబు సైతం సానుకూలం
- త్వరలో నిర్ణయం ప్రకటించే అవకాశం

**ప్రభాత సూర్య ఏపీ బ్యూరో** ఆ పదవిలో ఏపీకి చెందిన మహిళ నేత దగ్గుబాటి పురందేశ్వరికి కూర్చోబెడతారని ప్రచారం నడుస్తోంది. కేంద్ర మంత్రి పదవి ఆశిస్తున్న పురందేశ్వరి విషయంలో కేంద్ర పెద్దల ఆలోచన మారినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఏపీకి అరుదైన గౌరవం దక్కినట్టే. గత కొన్నేళ్లుగా పదవి ఖాళీ.. ఎన్డీఏ వరుసగా

ఏపీకి మరో జాతీయస్థాయి పదవి రానుందా? లోక్సభ డిప్యూటీ స్పీకర్ పోస్టు ఏపీకి కేటాయించనున్నారా? ఎంపీ పురందేశ్వరికి ఆ పదవి కట్టబెట్టనున్నారా? ఏపీ పొలిటికల్ సర్కిల్స్లో కొత్త చర్చ ప్రారంభం అయింది. కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న లోక్సభ డిప్యూటీ స్పీకర్ పోస్టును ఎట్టకేలకు భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది.

- మిగతా 2వ పేజీలో

## రేవంత్ హోం శాఖను వదులుకుంటే మేలు!

రాష్ట్రంలో గాడి తప్పుతున్న శాంతి భద్రతలు

పోలీస్ శాఖ పనితీరుపై అనేక ప్రశ్నలు

జాడ లేని ఫ్రెండ్లీ పోలీస్..



**ప్రభాత సూర్య తెలంగాణ బ్యూరో :** తెలంగాణకు హోం మంత్రి లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం హోమ్ శాఖ సీఎం రేవంత్ రెడ్డి వద్ద ఉంది. అభివృద్ధితోపాటు సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయని ప్రభుత్వం భావిస్తోంది. కానీ కీలకమైన శాంతిభద్రతల విషయంలో అడుగడుగునా వైఫల్యాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పోలీస్ శాఖలో అవినీతి ఘటనలు వెలుగు చూస్తుండడం ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది.

2లో

## పోచారం యూటర్న్!



### కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి

### గులాబీ పార్టీ వైపు తిరిగి చూపు

తెలంగాణలో పెద్దాయన పోచారం శ్రీనివాస్ రెడ్డి మనసు మారుతోందా? అనవసరంగా కాంగ్రెస్ లోకి వచ్చానని బాధపడుతున్నారా? తిరిగి గులాబీ బాస్ పిలిస్తే వెళ్ళిపోవాలని చూస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. అనవసరంగా కాంగ్రెస్ పార్టీలో చేరి తప్పు చేశానని ఆయన అనుచరులు వద్ద బాధపడుతున్నట్లు తెలుస్తోంది. పరిస్థితి విషమిస్తే హస్తం పార్టీకి సైతం గుడ్ బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

**ప్రభాత సూర్య తెలంగాణ బ్యూరో:** కాంగ్రెస్ లో దక్కని గౌరవం .. తెలంగాణలోని పోచారం శ్రీనివాస్ రెడ్డి సీనియర్ మోస్ట్ లీడర్. మొన్నటి ఎన్నికల్లో గులాబీ పార్టీ నుంచి బాన్సువాడ నుంచి గెలిచారు. అయితే ఏదేదో ఊహించుకొని అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడిగా

2లో



మిగతా 2లో

## కేటీఆర్ నోట చంద్రబాబు మాట!

గొప్ప సీఎం అంటూ పొగడ్త

గతంలో సిబిఎన్ అరెస్టు సమయంలో భిన్న స్వరం

తెలంగాణలో పరిస్థితులతో యూటర్న్

## ఆదాయం పెంపు ఎజెండాగా..

నేడు రాష్ట్ర మంత్రివర్గం భేటీ

భూముల విలువల పెంపునకు ఆమోదం తెలిపే అవకాశం

రుణాల రీస్ట్రక్చర్, ఆదాయ లీకేజీలను అరికట్టే ప్రణాళికపై చర్చ!

ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలపైనా స్పష్టత వచ్చే చాన్స్



హైదరాబాద్: అనివార్య ఖర్చులు, నెలనెలా పెరుగుతున్న ఆర్థిక భారాన్ని తట్టుకుని నిలబడేందుకు అవసరమైన ఆదాయ మార్గాలపై చర్చ ఎజెండాగా రాష్ట్ర మంత్రివర్గం సోమవారం భేటీ కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం మూడు గంటలకు సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ఈసారి కేబినెట్ సమావేశంలో ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చే నివేదికపైనే చర్చ జరుగుతుందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది.

2లో

# ఆదాయం పెంపు ఎజెండాగా..

అందులో భాగంగానే రాష్ట్రంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తుల విలువల పెంపునుకు గ్రీన్‌సిగ్నల్ లభించనుందని సమాచారం. భూముల విలువల సవరణకు సంబంధించిన ప్రక్రియను రిజిస్ట్రేషన్ల శాఖ పూర్తి చేసిన నేపథ్యంలో మంత్రిువర్గం ఆమోదిస్తే ఈనెలలోనే, లేదంటే జూన్1వ తేదీ నుంచి సవరించిన విలువలు అమల్లోకి వచ్చే అవకాశాలున్నాయని తెలుస్తోంది. దీంతో పాటు రుణాల రీస్ట్రక్చర్ కోసం కేంద్రానికి చేయాల్సిన ప్రతిపాదనలు, రాబడి శాఖల్లో లీకేజీలను అరికట్టడం లాంటి అంశాలపై కూడా మంత్రివర్గం చర్చించి తగు నిర్ణయాలు తీసుకోనుంది. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన దాదాపు రూ.14 వేల కోట్ల బకాయిల విషయంలోనూ ఓ రోడ్‌మ్యాప్ తయారు చేయనున్నట్టు సమాచారం. ముఖ్యంగా రిటైరయిన ఉద్యోగులకు సంబంధించిన రూ.8 వేల కోట్ల బకాయిలను 100 రోజుల్లో చెల్లించే విషయంలో ఏం చేయాలన్న దానిపై మంత్రివర్గం ఓ కార్యాచరణ రూపొందించనున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దీంతో పాటు తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణం.. తదితర అంశాలపై కూడా మంత్రివర్గం చర్చించనుంది.



# కేటీఆర్ నోట చంద్రబాబు మాట!

(మొదటి పేజీ తరువాయి)

**ప్రభాత సూర్య తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో కేటీఆర్ వ్యూహం మార్చారా? కమ్మ సామాజిక వర్గం పై ఫోకస్ పెట్టారా? అందులో భాగంగానే తెలుగుదేశం పార్టీ నాయకత్వంతో దోస్తీకి ప్రయత్నం చేస్తున్నారా? చంద్రబాబును గొప్ప ముఖ్యమంత్రిగా పొగడ్త వెనుక కారణం అదేనా? పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. తెలుగుదేశం పార్టీ అంటేనే వ్యతిరేకత కనబరిచే కేటీఆర్ లో ఈ మార్పు వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అర్థమవుతోంది.

**స్పష్టమైన మార్పు..**

ఇటీవల కేటీఆర్ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. 2023 ఎన్నికల్లో జరిగిన తప్పిదాలను సరిచేస్తూ.. ముందుకు సాగుతామని ఆయన చెప్పిన తీరు చూస్తుంటే మాత్రం పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. ప్రధానంగా తెలుగుదేశం పార్టీ విషయంలో గతం మాదిరిగా వ్యవహరిస్తే తెలంగాణలో ఇబ్బందులు తప్పవని కేటీఆర్ గుర్తించినట్లు తెలుస్తోంది. అందుకే టిడిపి విషయంలో గతం గతః అన్నట్టు ముగించాలని భావిస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. తాజాగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పై ఆరోపణలు చేసిన క్రమంలో.. గొప్ప ముఖ్యమంత్రులుగా నందమూరి తారక రామారావు, వైయస్ రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు, కెసిఆర్లను అభివర్ణించారు. తద్వారా చంద్రబాబు విషయంలో కేటీఆర్ బాగా తగ్గినట్లు తెలుస్తోంది.

**కవిత తీరుతో..**



తెలుగుదేశం పార్టీ విషయంలో కేటీఆర్ వ్యవహార శైలి మారడానికి సోదరి కవిత ఒక కారణం. కవిత కొత్త పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నారు. బీసీ నినాదంతో ఆమె తెలుగుదేశం పార్టీ క్యాడర్ పై గురిపెట్టినట్టు కనిపిస్తున్నారు. ఒకవేళ తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆమె వైపు మొగ్గుచూపితే మాత్రం భారత రాష్ట్ర సమితి అస్తిత్వానికి ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే కేటీఆర్ వ్యూహం మార్చినట్లు స్పష్టం అవుతోంది తెలుగుదేశం పార్టీ విషయంలో..

**లి చంద్రబాబు అరెస్టు సమయంలో..**

2023 సెప్టెంబర్ లో అరెస్ట్ అయ్యారు చంద్రబాబు. ఆ సమయంలో తెలంగాణలో కెసిఆర్ పార్టీ అధికారంలో ఉంది. అయితే హైదరాబాదులో సాఫ్ట్వేర్ ఇంజనీర్లు చంద్రబాబు అరెస్ట్ కు నిరసనగా ఆందోళనలు నిర్వహిస్తామంటే ఇదే కేటీఆర్ కుదరదని తేల్చి చెప్పారు. ఏపీలో అరెస్టులకు తెలంగాణతో సంబంధం ఏంటని అనుచితంగా వ్యాఖ్యానించారు. కెసిఆర్ సైతం చంద్రబాబు విషయంలో చాలా చులకనగా ఉండేవారు. కనీసం ఆ అరెస్టుపై స్పందించిన దాఖలాలు కూడా లేవు. పైగా 2018లో చంద్రబాబు కాంగ్రెస్ పార్టీతో తెలంగాణలో చేతులు కలపడాన్ని జీర్ణించుకోలేకపోయారు కేసీఆర్. అందుకే 2019లో రిటర్న్ గిఫ్ట్ పేరిట జగన్మోహన్ రెడ్డికి చాలా విధాలుగా సాయం చేశారు. తెలంగాణ ఎన్నికల్లో కేసీఆర్ గెలిచి.. ఏపీ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి గెలిచేసరికి చంద్రబాబు విషయంలో గులాబీ దండు పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కానీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా తెలంగాణలో పోటీ నుంచి తప్పుకున్నారు చంద్రబాబు. అలా టిడిపి క్యాడర్ గులాబీ పార్టీపై ఉన్న కోపంతో కాంగ్రెస్ పార్టీ వైపు నిలిచింది. దాని పర్యవసానాలే 2023 ఎన్నికల్లో గులాబీ పార్టీ ఓటమి. 2024 నాలుగు సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం. అందుకే ఇప్పుడు కేటీఆర్ గుణపాఠాలు నేర్చుకున్నట్టు ఉన్నారు. టిడిపి విషయంలో జరిగిన తప్పిదాన్ని సరి చేసుకునే పనిలో పడ్డారు.

# రేవంత్ హోం శాఖను వదులుకుంటే మేలు!

(మొదటి పేజీ తరువాయి)

తక్షణం హోం శాఖను మంత్రికి బదలాయించకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకునే పరిస్థితి కనిపిస్తోంది.

**ప్రతికూల పరిస్థితుల్లో..**

ప్రతికూల పరిస్థితుల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ ఇచ్చిన పార్టీగా రెండుసార్లు వెనుకబడిన ఆ పార్టీ.. రేవంత్ రెడ్డి నేతృత్వంలో దూకుడుగా వ్యవహరించడంతో ప్రజలు గుర్తించి అధికారం కట్టబెట్టారు. కానీ కీలకమైన శాంతిభద్రతల పర్యవేక్షణ, లా అండ్ ఆర్డర్ విషయంలో మాత్రం అనుకున్న స్థాయిలో పరిణితి కనబరచడం లేదు. హోం శాఖను రేవంత్ రెడ్డి తన వద్ద పెట్టుకున్నారు. దీంతో పోలీస్ శాఖలో వెలుగు చూస్తున్న వైఫల్యాలు రేవంత్ ఖాతాలో పడుతున్నాయి. ఆయన మేల్కొని హోం శాఖను మంత్రికి బదలాయిస్తే మేలన్న అభిప్రాయం తెలంగాణ సమాజం నుంచి వినిపిస్తోంది.

**జాడ లేని ఫ్రెండ్లీ పోలీస్..**

తెలంగాణలో ఫ్రెండ్లీ పోలీస్ అనేది లేదని ప్రధాన విమర్శ. ఇటీవల మానవ హక్కుల కమిషన్ కూడా ఈ విషయాన్ని గుర్తు చేసి ఆక్షేపించింది. అయితే తాజాగా ఒక సబ్ ఇన్స్పెక్టర్ ఒక చిన్న కేసులో లిక్కర్ బాటిల్లను లంచంగా కోరడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. సహజంగా ఫిర్యాదు చేయడానికి వెళ్ళిన వారి దగ్గర డబ్బులు తీసుకోవడమే నేరం.. అటువంటిది ఏకంగా లిక్కర్ బాటిల్ లంచంగా కోరారు రంగారెడ్డి జిల్లా మీర్ పేట ఎస్సై నాగభూషణం. ఈ ఘటనతో తెలంగాణ పోలీస్ శాఖ పరువు పోయింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా అధికారులు ఆ అధికారిపై చర్యలు తీసుకున్నారు. కానీ ఏకంగా సీఎం రేవంత్ వద్ద ఉన్న శాఖలో ఇటువంటి ఘటనలు జరగడం విమర్శలకు తావిస్తోంది. కచ్చితంగా వీటికి రేవంత్ సమాధానం చెప్పాలన్న డిమాండ్ పెరుగుతోంది.

**ధీమా మంచిదే కానీ**

తాము బాగా పాలిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతోందని చెబుతోంది. సంక్షేమ పథకాలతో ప్రజల్లో సంతృప్తి ఉందని కూడా అంచనా వేస్తోంది. సో అంతా ఓకే. కానీ శాంతి భద్రతలను పరిరక్షించే పోలీస్ శాఖలో అవినీతిని ప్రజలు హర్షించరు. ఇటీవల కోర్టులు సైతం పోలీస్ శాఖ పనితీరును ఆక్షేపిస్తున్నాయి. వీటిని ఇలానే ఉపేక్షిస్తే మూల్యం చెల్లించుకునేది కాంగ్రెస్ ప్రభుత్వం. అందుకే రేవంత్ అత్యవసరంగా హోం శాఖకు ప్రత్యేకంగా ఒక మంత్రిని నియమించడం.. లేకుంటే ఇప్పటికే ఉన్న మంత్రుల్లో ఒకరికి హోం శాఖ ఇవ్వడం అనివార్యం. లేకుంటే మాత్రం ఇబ్బందికరమే.

# పోచారం యూటర్న్!

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ సర్కార్ నియమించింది. మంత్రిగా, స్పీకర్ గా పనిచేసిన ఆయనకు వ్యవసాయ సలహాదారుడని పదవి కేవలం అలంకారం మాత్రమే. అయితే గులాబీ పార్టీలో ఎంతో గౌరవం పొందిన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత సాధారణ ఎమ్మెల్యే అయ్యారు. దీంతో తన మాటకు కనీస విలువ లేకపోవడంతో ఆయన తీవ్ర ఆవేదనతో ఉన్నారు. ముఖ్యంగా సిద్ధాపూర్ రిజర్వాయర్ నిధుల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యం పోచారం శ్రీనివాస్ రెడ్డికి కోపం తెప్పించిందట. నిధుల కోసం మంత్రుల కాళ్లు మొక్కాలా? అంటూ ఆయన తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. నిధుల కోసం 20 సార్లు మంత్రిని అడిగితే కనీసం స్పందించడం లేదన్నారు. కనీసం ఫోన్ కాల్స్ కూడా మంత్రులు రిసీవ్ చేసుకోకపోవడం పై ఆయన తీవ్ర ఆవేదనతో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే బాహాటంగానే కాంగ్రెస్ ప్రభుత్వం పై ఆయన వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ఆయన తీరు చూస్తుంటే తిరిగి గులాబీ పార్టీలో చేరిపోతారా అనే అనుమానాలు కలుగుతున్నాయట.

**27 ఏళ్ల పాటు టిడిపిలో..**

తెలుగుదేశం పార్టీలో ఒక వెలుగు వెలిగారు పోచారం శ్రీనివాస్ రెడ్డి. ఆ పార్టీ ద్వారానే పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. 1984లో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలం పంచాయితీరాజ్, గృహ నిర్మాణం, గనుల శాఖ మంత్రిగా పనిచేశారు. 1994లో బాన్సువాడ నియోజకవర్గం నుంచి గెలిచారు. 1999లో సైతం తన విజయాన్ని కొనసాగించారు. 2004లో మాత్రం ఆయన ఓడిపోయారు. 2009లో తిరిగి గెలిచారు. 27 సంవత్సరాల పాటు తెలుగుదేశం పార్టీలోనే కొనసాగారు. 2011లో మాత్రం కెసిఆర్ పిలుపుతో తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరారు. అయితే ఆయన రాజీనామాతో జరిగిన ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజారిటీతో గెలిచారు. 2014లో అదే టిఆర్ఎస్ అభ్యర్థిగా రెండోసారి పోటీ చేసి విజయం సాధించారు.. కెసిఆర్ మంత్రివర్గంలో స్థానం సంపాదించారు. 2018లో మూడోసారి టిఆర్ఎస్ తరఫున పోటీ చేసి విజయం సాధించిన పోచారం శాసనసభ స్పీకర్ అయ్యారు. 2023లో గులాబీ పార్టీ తరపున బాన్సువాడ నుంచి ఐదోసారి గెలిచి రికార్డు సృష్టించారు. కానీ కొద్ది రోజులకే కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. ఇప్పుడు ఆయన పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. తిరిగి గులాబీ పార్టీలో చేరుతారని ప్రచారం జరుగుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# లోక్సభ డిప్యూటీ స్పీకర్‌గా చిన్నమ్మ!



(మొదటి పేజీ తరువాయి)

మూడోసారి అధికారంలోకి వచ్చింది. ప్రధానిగా నరేంద్ర మోడీ మూడోసారి బాధ్యతలు స్వీకరించారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం డిప్యూటీ స్పీకర్ పోస్టును భర్తీ చేయలేదు. వాస్తవానికి డిప్యూటీ స్పీకర్ పోస్టును ప్రతిపక్షానికి కేటాయించాలి. ప్రధాన ప్రతిపక్ష పార్టీ నుంచి ఒక నాయకుడిని భర్తీ చేయాలి. కానీ రాజకీయ కారణాల దృష్ట్యా భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్ పార్టీకి ఆ పదవి ఇచ్చేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో గత కొంతకాలంగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. లోక్సభ స్పీకర్ లేని సమయంలో ప్యానల్ స్పీకర్ తో నెట్టుకొస్తున్నారు. కానీ ఇప్పుడు మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బిజెపి ఎంపీ తోనే లోక్సభ డిప్యూటీ స్పీకర్ పోస్టును భర్తీ చేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది.

**ఆమెకే ఛాన్స్..**

ఏపీ నుంచి మహిళా నేత దగ్గుబాటి పురందేశ్వరికి ఈ చాన్స్ ఇవ్వనున్నట్లు సమాచారం. మొన్నటి ఎన్నికల్లో బిజెపి తరఫున రాజమండ్రి నుంచి ఎంపీగా గెలిచారు పురందేశ్వరి. అంతకుముందు బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలుగా వ్యవహరిస్తూ మూడు పార్టీల పొత్తుకు ఆమె కృషి చేశారు. అయితే ఎంపీగా గెలవడంతో రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే కేంద్ర మంత్రి పదవి కోసమే ఆమెతో రాష్ట్ర అధ్యక్ష పదవి రాజీనామా చేయించారన్న ప్రచారం అప్పట్లో జరిగింది. ఇంతలో ఆమె పేరు జాతీయ అధ్యక్ష పదవికి వినిపించింది. కేంద్ర మంత్రి పదవికి వినిపించింది. ఇవేవీ జరగలేదు. అందుకే ఇప్పుడు డిప్యూటీ స్పీకర్ పోస్ట్ కోసం ఆమె పేరును ప్రతిపాదనలోకి తీసుకున్నట్లు సమాచారం. అదే సమయంలో ఏపీ సీఎం చంద్రబాబు సైతం ఆమె విషయంలో సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. మొత్తానికైతే చిన్నమ్మకు లోక్సభ డిప్యూటీ స్పీకర్ పోస్టు ఖాయమని తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీని విభేదించి భర్తతో పాటు కాంగ్రెస్లో చేరిన ఆమె 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఎంపీగా గెలిచారు. తరువాత కేంద్ర మంత్రి అయ్యారు. రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి బిజెపిలో చేరారు.. బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవికి సుదీర్ఘకాలం పనిచేశారు. మొన్నటి ఎన్నికల్లో రాజమండ్రి ఎంపీగా గెలిచారు. లోక్సభ డిప్యూటీ స్పీకర్ అయితే ఆమెకు అరుదైన గౌరవం దక్కినట్టే.

# అందరి చూపు బెంగాల్ పైనే!

న్యూఢిల్లీ, మే 3: టీఎంసీ, డీఎంకే వంటి ప్రాంతీయ పార్టీలతోపాటు బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాలకు ఫలితం కీలకంగా మారిన పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అస్సాం, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం జరగనున్నది. మూడు అంచెల భద్రత వ్యవస్థ కలిగిన లెక్కింపు కేంద్రాల్లో ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. తొలిసారిగా కౌంటింగ్ కేంద్రాల్లోకి అనధికార ప్రవేశాన్ని నివారించడానికి ఎన్నికల సంఘం ఈసీఐఎన్ఈటీ ద్వారా క్యూర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డు వ్యవస్థను ప్రవేశపెట్టింది. పశ్చిమ బెంగాల్‌లోని 293 అసెంబ్లీ స్థానాలకు 77 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరగనున్నది. ఈసారి ఊహించని రీతిలో భద్రతా ఏర్పాట్లు జరిగాయి. ఫలితాల రోజు వరకు తీవ్ర వాగ్వాదం నెలకొంది. అధికార టీఎంసీ, ప్రతిపక్ష బీజేపీ రెండూ ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశాయి. రెండు దశల్లో జరిగిన పోలింగ్ ఏప్రిల్ 29న ముగిసింది. స్వాతంత్ర్యం అనంతరం మొదటిసారి రికార్డు స్థాయిలో 92.47 శాతం ఓటింగ్ నమోదైంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని ఫల్తా నియోజకవర్గంలో తీవ్రమైన ఎన్నికల ఉల్లంఘనలను కారణంగా చూపుతూ ఎన్నికలను ఎన్నికల కమిషన్ రద్దు చేసింది. ఆ నియోజకవర్గంలోని మొత్తం 285 పోలింగ్ కేంద్రాలలో మే 21న రీపోలింగ్ జరగనున్నది. ప్రధాన ప్రతిపక్షం బీజేపీ నుంచి బలమైన సవాలును ఎదుర్కొన్న అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) వరుసగా నాలుగోసారి గెలవాలని ఆశిస్తుండగా 2021 ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన సీపీఎం, కాంగ్రెస్ తిరిగి పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. హుమాయున్ కబీర్ నేతృత్వంలోని ఏజేయూపీ, అసదుద్దీన్ ఒవైసీ సారథ్యంలోని ఏఐఎంఐఎం కూడా కొన్ని కీలక ప్రాంతాలలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. ఇదివరకు మొత్తం 87 కౌంటింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ప్రకటించగా అ సంఖ్యను 77కు తగ్గించింది. 2021లో మొత్తం 107 కౌంటింగ్ కేంద్రాలను ఈసీ ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుత కౌంటింగ్ సందర్భంగా బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఈసీ ఏర్పాటు చేసింది. కౌంటింగ్ శాంతియుతంగా, పారదర్శకంగా, క్రమబద్ధంగా జరిగేలా చూసేందుకు సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేశామని ఈసీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. 165 అదనపు కౌంటింగ్ పరిశీలకులను, 77 పోలీసు పరిశీలకులను ఈసీ నియమించింది. రిటర్నింగ్ అధికారులు, పరిశీలకులు మినహా మిగతా వారికి మొబైల్ ఫోన్లను నిషేధించడం సహా లెక్కింపు కేంద్రాల వద్ద కఠినమైన ప్రవేశ నియంత్రణ చర్యలను ఈసీ ప్రవేశపెట్టింది. అస్సాంలో హ్యాట్రిక్ సాధించగలమని బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ఆశిస్తున్నది. రాష్ట్రంలోని 126 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 722 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ధారించే ఈవీఎంలను 35 జిల్లాలోని 40 కౌంటింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం తెరవనున్నారు. కౌంటింగ్ కేంద్రాలు, ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత కోసం 25 కంపెనీల (ఒక్కోదానిలో దాదాపు 100 మంది సిబ్బంది) సీఆర్‌పీఎఫ్ దళాలను ఈసీ నియమించింది.

# చెవిరెడ్డి ఔట్



కానీ జగన్మోహన్ రెడ్డి అందుకు అంగీకరించలేదు. విశ్వసించలేదు కూడా. ప్రాధాన్యత తగ్గినట్టే తగ్గించి సజ్జలకు రాష్ట్ర సమన్వయ బాధ్యతలు కట్టబెట్టారు. తన తరువాత అంతటి పెద్ద పోస్టు ఇచ్చారు. అయితే మొన్న ఆ మధ్య ఏం జరిగిందో తెలియదు కానీ సజ్జల రామకృష్ణారెడ్డి పెద్దగా కనిపించకుండా మానేశారు జగన్ వెంట. అదే సమయంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జగన్ వెంట నిత్యం కనిపించడం ప్రారంభించారు. అయితే సజ్జల రామకృష్ణారెడ్డిని జగన్మోహన్ రెడ్డి పక్కన పెట్టేసారన్న ప్రచారం మొదలైంది. తాడేపల్లి లో ఏ కార్యక్రమం జరిగిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కనిపించడం అందరిలోనూ అనుమానాలను పెంచింది. సర్వే సంస్థలతోపాటు వివిధ రూపాల్లో జగన్మోహన్ రెడ్డికి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దగ్గరయ్యారట.

**అన్ని ఆధారాలతో..**

అయితే సజ్జల రామకృష్ణారెడ్డి వ్యవహారం తెలియంది కాదు. ఎందుకంటే పార్టీలో నెంబర్ 2 గా ఉన్న విజయసాయి రెడ్డి లాంటి వారినే సైడ్ చేయించిన ఘనత సజ్జల రామకృష్ణారెడ్డిది. అటువంటిది చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి విషయంలో సజ్జల రామకృష్ణారెడ్డి పక్కా ప్లాన్ తో కొన్ని రకాల ఆధారాలు సేకరించారు. ప్రధానంగా మద్యం కుంభకోణం లో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి 600 కోట్ల రూపాయలు పక్కదారి పట్టించారు అనే ఆధారాలు సజ్జల సేకరించారట. ఆపై వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎగ్ పఫ్ల వివాదం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అనవసరంగా ఈ వివాదంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెడ్డ పేరు వచ్చింది. దాని వెనుక కూడా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఉన్నారు అని సజ్జల రామకృష్ణారెడ్డి ఆధారాలు సేకరించారట. అప్పట్లో సీఎంవో కు భోజనాల కాంట్రాక్టు చెవిరెడ్డి తీసుకున్నారని.. అప్పటివరకు 300 రూపాయలు ఉన్న భోజనం ఖర్చును వెయ్యి రూపాయలుగా చూపించి ఒక్కో ప్లేటు వద్ద

## నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్





మిర్యాలగూడ మే 3:-( ప్రభాత సూర్య): మిర్యాలగూడ మండలం జంకుతండ గ్రామపంచాయతీలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ లబ్దిదారుల కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం లబ్దిదారులను షాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధి దారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల సొంత ఇంటి కలను నెరవేర్చిన ప్రజా ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే బిఎల్ఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూప్రతీ గ్రామంలో నిరుపేదల సొంత ఇంటి కలలు నెరవేరుస్తూ వారి కుటుంబాలలో ఆనంధాలు చూస్తుంటే ప్రజా ప్రభుత్వంలో భాగస్వామిని అయినందుకు గర్వంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్ధిక పరిస్థితులను చక్కదిద్దుతూనే నిరుపేదల సంక్షేమం కోసం సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ళలాంటి అనేక వినూత్న పథకాలను అమలు చేస్తూ.. పేదల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. ప్రజా ప్రభుత్వానికి పేద ప్రజల ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని, అనునిత్యం ప్రజలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ , వార్డ్ మెంబర్స్, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమాజ సేవలో భాగస్వాములు కావాలి: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**తుర్కపల్లి, మే 3 ప్రభాతసూర్య :** యువ కళాకారులు జహంగీర్ మార్గాన్ని అనుసరించి సమాజ సేవలో భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండల కేంద్రంలో సామాజిక ఉద్యమ కళాకారుడు జహంగీర్ సంస్కరణ సభలో పాల్గొన్నారు .ఈ సందర్భంగా జహంగీర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తోటి కళాకారులు రూపొందించిన పాటల సిడిని ఆవిష్కరించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహంగీర్ సామాజిక చైతన్యాన్ని కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన గొప్ప కళాకారుడని కొనియాడారు. సమాజంలో అన్యాయాలు , అసమానతలపై తన కలతో పోరాడిన వ్యక్తిగా ఆయనను గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలు ఆలోచనలు ఎల్లప్పుడూ ప్రజలకు మార్గదర్శకాలుగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోమల వెంకటేశం, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు



## 33 కెవి విద్యుత్తు సబ్ స్టేషన్లో అగ్ని ప్రమాదం
## పలు గ్రామాలకు నిలిచిన విద్యుత్ సరఫరా



**మిర్యాలగూడ, మే 3:- (ప్రభాత సూర్య):** మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలో 33కెవి విద్యుత్ సబ్ స్టేషన్లో ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది, అదేవిధంగా పక్కనే ఉన్న వాహనం దగ్ధమయ్యింది. సబ్ స్టేషన్ లో అగ్నిప్రమాదం సంభవించగా వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా హుటాహుటిన చేరుకొని మంటలు ఆర్పారు. సబ్ స్టేషన్ లో ఇన్సూలేటర్ హీట్ ఎక్కడం వల్ల అగ్ని ప్రమాదం జరిగిందని ప్రాధమికంగా అంచనా వేశారు, పాక్షికంగా దెబ్బ తిన్నదని రూ. 50 లక్షల నష్టం జరిగి ఉంటుందని అనధికార అంచనా. దీంతో వెంకటాద్రిపాలెం, జంకుతండ, శ్రీనివాస్ నగర్, తుంగపాడ్, లావుడితండా, జప్తివీరప్పగూడెం, నందిపాడు, వాటర్ ట్యాంక్ తండ, భాగ్యగోపసముద్రం తండా, కుంటకిందితండా, ఐలాపూర్, చిల్లాపూర్, దుబ్బతండ, దీరవత్ తండా, జటావాత్ తండా, నాణ్యతండా, సీత్యతండాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సబ్ స్టేషన్ ను డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసాచారి, ఎడిఎ కె. రవికుమార్, ఎఇలు రవీందర్ రెడ్డి, రాంలాల్ లు సిబ్బందితో చేరుకొని మరమ్మతులు, కొత్త ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

## గాలి, దుమారం, అకాల వర్షంతో రైతాంగానికి తీరని నష్టం



**ప్రభాత సూర్య మాడుగుల పల్లి (మే 03)ప్రతినిధి :** నల్లగొండ జిల్లాలో లో ఒక్కసారిగా గాలి, దుమారం అకాల వర్షం కురవడంతో ఐకేపీ కేంద్రాలలో ఆరబోసిన ధాన్యం తడిసింది. మరోవైపు పంట చేతికోచ్చిన వరి, నిమ్మ తోట, బొప్పాయి, ఎండు మిర్చి రాలి నెలమట్టం అయింది. తోటలు, చెట్లు పూర్తిగా ద్వశీసం అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి, రైతాంగాన్ని ఆదుకోవాలని అఖిల భారత రైతు -కూలీ సంఘం (ఏ.ఐ.కె.ఎం.ఎస్) నల్లగొండ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేస్తుంది. వాతావరణ శాఖ వైఫల్యం, అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఐకేపీ కేంద్రాలలో రైతులు ఆరబెట్టిన దాన్యం తడిసిపోయింది. ఐకేపీ కేంద్రాలలో రైతంగానికి ధాన్యం తడవకుండా టార్పిన్ కవర్లు ఇవ్వాలని అనేక సార్లు మొరపెట్టుకున్నా అధికారులు శ్రద్దపెట్టలేదు. ఫలితం గా రోజుల తరబడి ధాన్యం కొనుగోలు చేయక పోవడంతో నేడు కురిసిన వర్షాలకు పూర్తిగా తడిసినది. నిమ్మ, మిర్చి, బొప్పాయి, బత్తాయి మామిడి తదితర తోటలు బలమైన ఈదురు గాలులకు చెట్లు ఇరిగి, టన్నుల కొద్ది కాయలు రాలిపోయాయి. ఇప్పటికే రైతులు అప్పులు చేసి పంటలు సాగుచేశారు. రైతు పంటకు మద్దతూ ధర లేక పోగా వాతావరణ అనుకూలించక పంట నష్టపోతున్నాడు. దేశానికి రైతే వెన్నెముక అంటున్న పాలకులు వ్యవసాయ రంగానికి తొడ్పాటు నందించడంలో పూర్తిగా విఫలం అయ్యారు. జిల్లా వ్యాప్తంగా నష్ట పోయిన వివిధ రకాల పంటలను గురించి తగిన నష్ట పరిహారం చెల్లించాలని అఖిల భారత రైతు -కూలీ సంఘం (ఏ.ఐ.కె.ఎం.ఎస్) నల్లగొండ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేస్తుంది.

## ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ ప్రమాణ స్వీకారోత్సవం..



**ప్రభాత సూర్య నర్సాపూర్ మే03:** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా అమరవాది లక్ష్మీనారాయణ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకట్ స్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆర్య వైశ్యుల పాత్ర కీలకమైందన్నారు ప్రభుత్వంలో వారికి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.అనంతరం నిర్వాహకులు మంత్రి వివేక్ వెంకట్ స్వామి,మాజీ మంత్రి టీజీ వెంకటేష్,నాయకులు కైలాస్ రామచందర్ గుప్త, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి,మాజీ ఎంపీ గిరీష్ సంఘీ లకు శాలువాలతో ఘనంగా సన్మానించి మెమంటోలతో సత్కరించారు.

## జగిత్యాల జిల్లా అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడి గా తడగొండ సంతోష్ కుమార్



**పెగడపల్లి మే 3( ప్రభాత సూర్య):** జగిత్యాల జిల్లా అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు ఆ రెల్లి లక్ష్మీరాజం, జగిత్యాల జిల్లా అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుని గా తడగొండ సంతోష్ కుమార్ ను నియమిస్తూ ప్రకటన విడుదల చేశారు పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన తడగొండ సంతోష్ కుమార్ మాట్లాడుతూ నా నియమకానికి సహకరించిన అంబేద్కర్ సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు నా వంతు సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కార్మికులను యాజమాన్యాల ముందు బానిసలుగా మార్చడమే బీజేపీ 4 లేబర్ కోడులు

## సాయి గూడెం లో సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జరిగిన మేడే జండావిష్కరణలో వక్తలు



**ఆలేరు మే 3 ప్రభాత సూర్య:** బీ జే పీ నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 4 లేబర్ కోడ్ ల మూలంగా యాజమాన్యాల ముందు కార్మికవర్గాన్ని బానిసలుగా చేసి శ్రమను దోచుకోవడమే నని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భువనగిరి డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెజాడి కుమార్, ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్ లు స్పష్టం చేశారు. ఆలేరు మండలం సాయి గూడెం లో సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ గ్రామ కమిటీ ఆద్వర్యంలో 140 వ మేడే ను ఘనంగా నిర్వహించారు. చికాగో మృత వీరులకు సంతాపం ప్రకటించి విప్లవ జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా సహదేవ్,కుమార్,సుదర్శన్ మాట్లాడుతూ,1886 లో అమెరికా లోని చికాగో కార్మిక వర్గం ఓటు హక్కు,ఎనిమిది గంటల పని దినం,సౌకర్యాలు,సమానత్వం,సమానత్వం,దోపిడీ, పీడన నిర్మూలన, సమాజ మార్పు కోసం పోరాడారని,అనేక కార్మిక చట్టాలు,హక్కులు సాధించారని అన్నారు. నేడు దేశ,ప్రపంచ పోరాట చరిత్రలో గుండు సున్నాగా ఉన్న బీ జే పీ కార్మికులు అనేక త్యాగాలు, ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తే దేశ కార్మిక వర్గం ఊరుకునే ప్రసక్తే లేదని మరింత పట్టుదలతో పోరాడుతుందని అన్నారు. 140 వ మేడే సందర్భంగా పార్టీ జెండాను గ్రామ కమిటీ కార్యదర్శి కొమ్మిడి గోపాల్ రెడ్డి ఎగురవేశాడు. ఈ కార్యక్రమంలో అరుణోదయ కళాకారులు శిఖిలం కుమారస్వామి, ఎలగందుల సిద్దులు, ఇక్కిరి శ్రీనివాస్,ఆర్.ఉదయ్,సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా డివిజన్,గ్రామ నాయకులు ఆర్.సీత,చిర బోయిన కొమురయ్య,మారుజోడు సిద్దేశ్వర్,తమ్మడి అంజయ్య,డొంకెన శ్రీహరి, తమ్మడి రమేష్, గోవింద్ పరమేష్,కొమ్మిడీ శ్రీకాంత్ రెడ్డి, కుర్రి మార్కండేయ, దార యాదగిరి,కడకంచి సత్యనారాయణ, కడకంచి రమేష్,కొమ్మిడి గాల్ రెడ్డి, మేకల వెంకటేష్,కడకంచి బీరయ్య, బైరి చంద్రయ్య,కొమ్మిడి నర్సింహారెడ్డి,కడకంచి మధు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ లో దొంగల బీభత్సం...

కరీంనగర్‌లోని పీఎంజే జువెలర్స్‌లో జరిగిన కాల్పుల ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన జరిగిన కొన్ని నిమిషాల ముందే తాను అదే ప్రాంతంలో ఉన్నానని, తన కార్యాలయానికి సమీపంలోనే ఈ ఘటన జరగడం బాధాకరమని ఆయన అన్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని కరీంనగర్ ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే, ఐదుగురు సాయుధ దుండగులు కస్టమర్ల రూపంలో జువెలరీ షాపులోకి ప్రవేశించారు. బంగారు ఆభరణాలు చూపించమని కోరారు. సిబ్బంది నగలు బయటికి తీయగానే, తుపాకులతో బెదిరించి దోపిడీకి యత్నించారు. సిబ్బంది ప్రతిఘటించడంతో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో సేల్స్ మేనేజర్‌తో పాటు ఇతర ఉద్యోగులు గాయపడ్డారు. గాయపడిన సిబ్బందిని, పోలీసు అధికారులను కలిసి వివరాలు తెలుసుకున్నట్లు బండి సంజయ్ తెలిపారు. క్షతగాత్రులకు ప్రాణాపాయం లేదని, మెరుగైన చికిత్స కోసం వారిని హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ పోలీసులు తక్షణమే స్పందించారని, పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో నిందితుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారని వివరించారు. సీసీటీవీ ఫుటేజీని విశ్లేషిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారని, నిందితులను పోలీసులు త్వరలోనే పట్టుకుంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## గంప మనోహర్ కుటుంబాన్ని పరామర్శించిన ష బిజెపి జిల్లా అధ్యక్షుడు.



**ఆలేరు మే 3 ప్రభాత సూర్య:** ఆలేరు పట్టణం బిజెపి సీనియర్ నాయకుడు మాజీ మండల అధ్యక్షుడు గంప మనోహర్ గారి తల్లి గంప వర్ధనమ్మ ఇటీవల స్వర్గస్తులైనరు.ఇందులో భాగంగా సీనియర్ నాయకులు గంప మనోహర్ ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊర్మారి అశోక్ గౌడ్ పరామర్శించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పన్నాల చంద్ర శేఖర్ రెడ్డి ,జిల్లా ప్రధాన కార్యదర్శి కదూరి అచ్చయ్య ,జిల్లా కార్యదర్శి కామిటికారి కృష్ణ ,జిల్లా నాయకులు మంగు నర్సింహులు,,దయ్యాల కుమారస్వామి,పట్టణ ప్రధాన కార్యదర్శి ఎలగల వెంకటేష్, మండల కార్యదర్శి బైరి మహేందర్ గౌడ్, ఓబీసీ పట్టణ అధ్యక్షులు ఎగ్గిడి సంపత్, కాంతుల శంకర్,వల్లపురెడ్డి దినేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పటాన్చెరువులో శ్రీ కోదండ సీతారామచంద్ర స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం



**పటాన్చెరు, మే 2,ప్రభాత సూర్య :** పటాన్చెరువులోని శ్రీ కోదండ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమం ఈ రోజు శనివారం సందర్భంగా భక్తి వాతావరణంలో జరిగింది. మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు, పాదచారులకు, సమీప కాలనీల నివాసులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదం చేస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ అన్నదాన కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుండటం స్థానికుల్లో సంతోషాన్ని కలిగిస్తోంది.

## ఘనంగా బాలాజీ నగర్ లో శ్రీ షిరిడి సాయిబాబా 18 వ వార్షికోత్సవం

**ప్రత్యేక పూజలు నిర్వహించిన కమిటీ చైర్మన్ సాధు ప్రతాప్ రెడ్డి**



**కూకట్ పల్లి, మే 02 (ప్రభాత సూర్య) :** కూకట్ పల్లి నియోజకవర్గం, బాలాజీ నగర్ డివిజన్ లో వెలసిన శ్రీ షిర్డీ సాయిబాబా మందిరశీ 18వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సాధు ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నసమారాధన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం గుడి చైర్మన్ అనంతరం గుడి చైర్మన్ సాధు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఏ కష్టం వచ్చినా ఆలయాలకు వెళ్లి తమ కష్టాన్ని చెప్పుకుంటారని, అలాగే మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని అన్నారు. బాబా దయవల్ల బాలాజీ నగర్ డివిజన్ లోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆ బాబాని వేడుకున్నారు. ఈ కార్యక్రమానికి వేల సంఖ్యలో భక్తులు పాల్గొని సాయిబాబా వారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

## టీజేఎస్ నాల్గో ప్లీనరీ విజయవంతం చేయాలి

**జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి**



**మిర్యాలగూడ మే 2:- ( ప్రభాత సూర్య):** సామాన్యులకు రాజకీయాల్లో స్థానం కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ జన సమితినీ ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో ఆవిర్భవించిన తెలంగాణ జన సమితి ప్లీనరిని విజయవంతం చేయాలని సమితి నల్గొండ జిల్లా అధ్యక్షులు పన్నాల గోపాల్ రెడ్డి అన్నారు. టీజేఎస్ నాలుగవ ప్లీనరీ సమావేశ విజయవంతం చేయుటకు రూపొందించిన వాల్ పోస్టర్లను మిర్యాలగూడ పట్టణం ఎన్ఎస్పి క్యాంపులోని అమరవీరుల స్థూపం వద్ద శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. గత ప్రభుత్వ కేసీఆర్ నిరంకుశ పాలనను ఓడించడం అత్యవసరమని భావించి ఆ లక్ష్యసాధన కోసం రాజకీయ నిర్ణయాలు తీసుకొని గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్కు మద్దతు తెలిపాము కానీ కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడం లేదు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుకు ప్లీనరీ సమావేశంలో ఉద్యమ కార్యాచరణ రూపొందించుకొని నిరంతరము పోరాటం కొనసాగిస్తామని అన్నారు .జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ మే 12న హైదరాబాద్ నెక్లెస్ రోడ్ లోని జలవిహార్ లో నిర్వహించనున్న తెలంగాణ జన సమితి నాలుగో రాష్ట్ర ప్లీనరీ విజయవంతం చేయాలని నల్గొండ ప్రజలను కోరారు కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.క్రాంతి కుమార్, లచ్చిరామ్నాయక్, మంద శ్రీను, ప్రకాష్ నాయుడు, మురళి యాదవ్, నరేందర్, జయరాజు పాల్గొన్నారు.

# సమిష్టి సహకారంతో ఇస్నాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి..





- ప్రతి వార్డు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక..
- ప్రజా సంక్షేమం..అభివృద్ధి లక్ష్యంగా పనిచేయండి..
- పూర్తి పారదర్శకతతో నిధుల కేటాయింపు..
- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..
- ప్రశాంతంగా ముగిసిన కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక..
- ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్..
- బిఆర్ఎస్ ఖాతాలో నాలుగు కో ఆప్షన్ పదవులు..

**పటాన్చెరు, మే 2,ప్రభాత సూర్య :** ప్రజలు నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను పూర్తి పారదర్శకతతో నిర్వహించడంతోపాటు.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణం గా అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపడుతూ.. ఇస్నాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పాలకవర్గానికి సూచించారు. శనివారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక కార్యక్రమానికి హాజరై ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. బిఆర్ఎస్ తరపున ప్రతిపాదించిన విష్ణువర్ధన్ రెడ్డి, బండ సోనియా, నిజాముద్దీన్ బాబా, ఆసియా బేగంలు పూర్తి మెజారిటీతో కో ఆప్షన్ సభ్యులుగా ఎంపికయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ప్రతి కౌన్సిలర్ తమ వార్డు పరిధిలో నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి నిబద్ధతతో పని చేయాలని కోరారు. ఇప్పటికే 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లు పూర్తయ్యాయని.. అతి త్వరలో వీటికి శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. అధికార, ప్రతిపక్షం అని తేడా లేకుండా ప్రతి వార్డుకి సమస్థాయిలో నిధుల కేటాయింపులు చేయాలని పాలకవర్గానికి సూచించారు. ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందిస్తూ పారదర్శక పరిపాలన అందించాలని సూచించారు. నూతన కోఆప్షన్ సభ్యులకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సుమలత, కమిషనర్ వెంకట కిషన్, సీనియర్ నాయకులు గడిల శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్లు మమత, వెంకటేష్. ఆంజనేయులు. రాహుల్ రెడ్డి, ఈశ్వరమ్మ, కిషోర్ రెడ్డి, మంజుల, సంధ్య, నరేందర్ రెడ్డి, పాండు, లత, రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పేదవారికి సంక్షేమ ఫలాలు అందించాలి

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులపై అవగాహన సభలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి.. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య..**






**ఆలేరు, మే 02 ప్రభాత సూర్య:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఆలేరులోని ఇమ్మడి నరసింహారెడ్డి ఫంక్షన్ హాల్లో డిఆర్డిఓ నాగిరెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి అవగాహన సమావే శాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న పథకాలు అనేక మంది లబ్ధిదారులకు చేరుతున్నాయని, ఇంకా అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. పార్టీలకు అతీతంగా పనిచేస్తూ అభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రారంభమై రెండు నెలలు పూర్తవుతున్న సందర్భంగా ప్రజల్లో సంక్షేమ పథకాలపై అవగాహన పెరిగిందని ఎంపీ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అర్హులైన లబ్ధిదారులకు మరిన్ని కొత్త సంక్షేమ పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వార్డు సభ్యులు చిత్తశుద్ధితో పనిచేసి సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా చూడాలని సూచించారు.అలాగే ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, గ్రామాభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని అన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రైతు భరోసా వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గంధమల్ల రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందించి చెరువులను నింపే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మరియు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు 100 శాతం లబ్ధిదారులకు చేరేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గ్రామాభివృద్ధికి పార్టీలకు అతీతంగా ముందుకు రావాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో అవగాహన కార్యక్రమం అత్యంత కీలకమని అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు సాధ్యమని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల అమలులో జిల్లా ముందంజలో ఉందని, మహిళల కోసం స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. జూన్ తర్వాత కొత్త పథకాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ముందుగా వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్ ను ప్రారంభించిన అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్, యాదగిరిగుట్ట చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్, టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, మహిళా జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ, తాసిల్దార్ వి. ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్ కే. శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ జగన్మోహన్, ఏడిఏ వెంకట రమణారెడ్డి, ఏఓ శ్రీనివాస్ గౌడ్, ఆలేరు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఎంఏ ఎజాజ్, నాయకులు ముదిగొండ శ్రీకాంత్, ఆలేటి అనిల్, మట్టపల్లి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, రైతులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే యూత్ కాంగ్రెస్ లక్ష్యం

**ఆలేరు మే 2 ప్రభాత సూర్య:** రాహుల్ గాంధీ ని దేశ ప్రధానిగా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని యూత్ కాంగ్రెస్ తెలంగాణ ఇన్చార్జ్ భవ్య జి తెలిపారు. శనివారం ఆలేరు పట్టణంలోని ఇందిరా కాంగ్రెస్ భవన్లో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ తెలంగాణలో యూత్ కాంగ్రెస్ను బలోపేతం చేయడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యకలాపాలను గ్రామ స్థాయికి విస్తరించి, యువతను నాయకత్వంలోకి తీసుకురావడం ప్రధాన లక్ష్యమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమం లో యూత్ కాంగ్రెస్ ఆలేరు నియోజకవర్గం అధ్యక్షులు మంగ కిరణ్ కుమార్,యాదాద్రి జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్, ఆలేరు మండలు అధ్యక్షులు బండపల్లి మహేష్, వలపు రమేష్,శ్రవణ్ రెడ్డి,నర్సి రెడ్డి,సురేష్, పర్శి నరేష్, కోరుటూరి సత్తిష్ తదితరులు పాల్గొన్నారు.





## ధాన్యం లారీల అన్లోడింగ్ ఆలస్యం పై అధికారుల ఆకస్మిక తనిఖీ

**రైతులకు ఇబ్బందులు కలగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు**

**ఆలేరు, మే 2, ప్రభాత సూర్య:** ఆలేరు మండల కేంద్రంలోని మల్లికార్జున రైస్ మిల్లును శనివారం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఉ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లుకు ధాన్యం లోడ్తో వచ్చిన లారీలను పరిశీలించిన అధికారులు, అన్లోడింగ్ ప్రక్రియలో జరుగుతున్న ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీలను సమయానికి అన్లోడ్ చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి, మిల్లు యజమానితో ఫోన్ ద్వారా మాట్లాడి కారణాలను తెలుసుకున్నారు. హమాలీలు తక్కువగా ఉండటం వల్లే అన్లోడింగ్ పనులు ఆలస్యమవుతున్నాయని మిల్లు యజమాని వివరణ ఇచ్చాడు. దీనిపై స్పందించిన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ రైతులు పండించిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా దిగుమతి చేసుకోవడం మిల్లుల బాధ్యత అని స్పష్టం చేశారు. వెంటనే అవసరమైనంత మంది హమాలీలను నియమించి, మిల్లుకు వచ్చే ప్రతి లారీని అదే రోజు అన్లోడ్ చేసి పంపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, నిల్వ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

## ఎడిటోరియల్




# అప్పులు తీర్చడమెలా.. అన్న ఆలోచనేదీ?

అప్పులు తీర్చడమెలా..రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమెలా .. అన్న ఆలోచన ప్రభుత్వాలు చేయడం లేదు. కెసిఆర్ చేసిన అప్పుల గురించి ప్రశ్నించినప్పుడు ఆస్తులు సృష్టిస్తున్నామని అనేవారు. ఎపిలో చంద్రబాబుది కూడా అదే పాలసీ. కెసిఆర్ అప్పులు చేసి దివాళా తీసాడని ఆరోపించి, అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డి అంతకు మించిన అప్పులు చేస్తున్నారు. చంద్రబాబు కూడా అదే కోవలో ఉన్నారు. జీతాలు, భత్యాలకు డబ్బులు లేవు. ఉచిత పథకాలకు మాత్రం చేతికి ఎముక లేదన్నంతగా దోచిపెడు తున్నారు. ఈ లెక్కన మరో వదందేళ్లయినా అప్పులు తేరవు. వీరు సృష్టించిన ఆస్తులు అప్పులు తీర్చలేవు. ఉన్న భూములను తెగనమ్మేస్తున్నారు. ప్రధానంగా ఖర్చులు తగ్గించుకుని అప్పులు లేకుండా చేసుకునే ప్రణాళికలు రచించాలి. అప్పులు తీర్చడం ప్రథమ కర్తవ్యం కావాలి. ఇందుకోసం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలు అధికారం అప్పగించింది అప్పులు చేయడానికి కాదని గుర్తించాలి. పాలన పేరుతో రాష్ట్రాలను దివాళా తీయించే అధికారం రేవంత్‌కి, చంద్రబాబుకు లేదు. అలాగే దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్లే ప్రయత్నాలను మోడీ కూడా సమర్థించరాదు. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయరంగాన్ని ఆధునీకరించాలి. రైతులు పండించిన ధాన్యాన్ని సక్రమంగా కొనడం లేదు. దానిని ప్రజలకు చేరవేయడం లేదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా.. అధికారంలో ఉన్నవారు పట్టించుకోక పోవడం వల్లనే రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోయాయి. నెలనెలా వడ్డీలకే వేలకోట్లు తగలేయడం వల్ల ఒక్క అభివృద్ధి పని జరగడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది. విపక్షంలో ఉన్నవారు మరిన్ని ఉచిత పథకాల గురించి డిమాండ్ చేస్తున్నారు. ఈ పథకాలు కొంప ముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికే ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కడం లేదు. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా తీస్తున్నాయి. ఖర్చులు తగ్గించుకోవడం కోసం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలకు ముందు పెన్షన్లు రద్దు చేయాలి. రాజకీయ ప్రాపకం కోసం అందరికీ కేబినేట్ హోదాతో సలహాదారులను నియించుకోవడం పక్కన పెట్టాలి. అలాగే వీరి జీతభత్యాలను కూడా కనీసానికి తగ్గించాలి. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్న వేళ, సలహాదారులకు లక్షల్లో జీతాలు తగలేయడం సరికాదు. ఇందుకోసం ఉన్న భూములను తెగనమ్మడం, లిక్కర్ ధరలు పెంచడం, భూముల రిజిస్ట్రేషన్ ధరలు పెంచడం, పరోక్షంగా పన్నులు బాదడం వంటి చర్యలకు ఒడిగడుతున్నారు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఇందులో అసలు లబ్దిదారుల కన్నా అనర్హులే ఎక్కువ మంది ఉన్నారు. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం కూడా ముఖ్యమే. తాజాగా తెలంగాణలో మరో ఇద్దరు సలహాదారులను నియమించారు. ఇప్పటికే ఉన్నవారికి తోడు మరో ఇద్దరికి పునరావసం కల్పించాల్సిన అసవరం ఏమొచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేండ్లలో 14మంది సలహాదారులుగా నియమితులయ్యారంటే..వారు ఏంచేస్తారని జనం ప్రశ్నించాలి. వీరంతా క్యాబినెట్ హోదా ఉన్నవారే కావడంతో జీతాలు, భత్యాలు సరేసరి. ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రుల సంఖ్యకు దాదాపు సమానంగా సలహాదారులు ఉన్నారు. వీరంతా లక్షలకు లక్షల జీతాలు, భత్యాలూ అందుకుంటున్నారు. సలహాదారులు రాష్ట్ర ఖజానాకు తీవ్ర ఆర్థికనష్టం కలిగిస్తున్నారని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు మళ్లీ పలువురిని సలహాదారులుగా నియమించారు. అప్పులు తెచ్చి మరీ సలహాదారులకు జీతభత్యాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసలు ఇంతమంది సలహా దారులను ఎందుకు నియమిస్తున్నారు. వారు ఏం చేస్తున్నారనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు పోస్టులు సృష్టించిమరీ ఎందుకు నియమిస్తున్నారన్నది అర్థం కాదు. కెసిఆర్ చేసిన పనినే రేవంత్ కూడా చేస్తున్నారు. సూర్యదేవర ప్రసన్నకుమార్‌ను ఆగమేఘాల పై ఢిల్లీ నుంచి తీసుకొచ్చి బాధ్యతలు అప్పజెప్పారు. తాజాగా విహెచ్‌ను, రిటైర్డ్ డిజిపి శివప్రసాద్ రెడ్డిని సలహాదారులుగా నియమించారు. సలహాదారుల పోస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ పునరావాసం కోసం వాడుకొంటు న్నది. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. తర్వాత మూడు రోజులకే ఏడుగురు సలహాదారు లను తొలగించారు. 'రాష్ట్ర ఖజానాకు తీవ్ర ఆర్థికనష్టం కలిగించడంలో సలహాదారుల పాత్ర ఉన్నదని ఆనాడు చెప్పారు.

**మానవ నాగరికత అనేది వెయ్యి సంవత్సరాల కష్టాలు, త్యాగాలు, సంస్కృతి మరియు అచంచలమైన నైతిక విలువల అపురూప సమ్మేళనంతో రూపొందిన ఒక అద్భుత నిర్మాణం. అయితే, నేడు మనం జీవిస్తున్న కాలంలో మన చుట్టూ ఉన్న దృశ్యాలను చూస్తుంటే, ఒక ఆలోచనాపరుడి మనసులో సహజంగానే ఒక భయంకరమైన ప్రశ్న మెదులుతుంది.**

# మేల్కో సమాజమా!

## ఒక నవశకానికి నాంది పలకాలి

ఈ గొప్ప నాగరికత మనం ఏ దిశగా తీసుకువెళు తున్నాం? వ్యవస్థలోని కుళ్ళిన భాగాలు, నమ్మకద్రోహం అనే మహమ్మారి, మోసపూరిత ధోరణులు, మరియు కులమత వైషమ్యాల విషవృక్షం ఇవన్నీ నేటి సమాజ ముఖచిత్రంపై వేసిన ముడతలు.ఒక సమాజం నైతికంగా మేల్కొనకపోతే, ఎంత ఆర్థికంగా అభివృద్ధి చెందినా, ఆ అభివృద్ధి కేవలం బాహ్య శోభ మాత్రమే. లోపల అది ప్రాణం లేని శవంలా నిలబడుతుంది. ఈ వాస్తవాన్ని మనం అంగీకరించక తప్పదు.



నేటి సమాజంలో అత్యంత ప్రమాదకరమైన లక్షణం ఏమిటంటే, అవినీతి అనేది కేవలం రాజకీయ నాయకులకో పరిమితం కాలేదు. అది గాలిలా, నీరులా సమాజంలోని అన్ని పొరలలోకి ఇంకిపోయింది. ఒకప్పుడు అవినీతిని పాపంగా భావించే సమాజం, నేడు దానిని ఒక అవసరమైన సౌకర్యం గా స్వీకరిస్తోంది. అబద్ధాలు చెప్పడం, బంధుప్రీతిని సమర్థించుకోవడం ఇవన్నీ నేడు ప్రాక్టికల్ లైఫ్ స్కిల్స్ గా ప్రచారం చేయబడుతున్నాయి.దీని వల్ల కలిగే దుష్పరిణామం ఏమిటంటే, పిల్లలు తమ తల్లిదండ్రులను చూసి నేర్చుకుంటున్న పాఠం ఒక్కటే.నీతిగా బ్రతకడం అంటే ఓడిపోవడం, అవినీతి చేయడం అంటే గెలవడం. ఇది ఒక తరం నుండి మరో తరానికి బదిలీ అవుతున్న అత్యంత ప్రమాదకరమైన వారసత్వం. ఈ వ్యవస్థను మనం మార్చకపోతే, భవిష్యత్తులో మనం ఒక సమాజాన్ని కాకుండా, వ్యక్తుల స్వార్థాల సముదాయాన్ని మాత్రమే మిగిల్చుకుంటాం.సంబంధాలు, వ్యాపారాలు, చివరకు ప్రాణ స్నేహాలు కూడా నేడు విశ్వాస రాహిత్యంతో కునారిల్లుతున్నాయి. ఒక వ్యక్తి మరొక వ్యక్తిని నమ్మడానికి భయపడే స్థాయికి మనం చేరుకున్నాం. డిజిటల్ యుగంలో సైబర్ మోసాలు, ఆన్‌లైన్ దగాలు సామాన్యుడిని నిద్రపోనివ్వడం లేదు. ఇరుగు పొరుగు వారు పరాయి వారుగా మారుతున్నారు. నీవు ఎవరినీ నమ్మకు, అప్పుడే సురక్షితంగా ఉంటావు అనే భావన ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో బలంగా నాటుకుపోయింది.ఒక సమాజంలో విశ్వాసం లేకపోతే, అక్కడ సహకారం ఉండదు. సహకారం లేని చోట అభివృద్ధి కుంటుపడుతుంది. మనం ఒకరిని నమ్మని స్థితిలో, కలిసికట్టుగా అద్భుతాలను సృష్టించడం అసాధ్యం. ఈ విశ్వాసం అడుగంటిన సమాజంలో జీవించడం అంటే, ప్రతి అడుగు మైన్‌ఫీల్డ్‌లో వేయడం లాంటిదే.

జాతీయ నేర నమోదు విభాగం గణాంకాల ప్రకారం, గత దశాబ్దంలో మోసాలు, నమ్మకద్రోహం సంబంధిత కేసులు దాదాపు 60% పైగా పెరిగాయి. ముఖ్యంగా సైబర్ క్రైమ్ కేసులు 2022-2025 మధ్య కాలంలో మూడు రెట్లు పెరిగాయి. కులపరమైన ఘర్షణలు, మతపరమైన ఉద్రిక్తతలు ఇప్పటికీ వెయ్యికి పైగా అధికారికంగా నమోదవుతున్నాయి. అయితే, నమోదు కాని కేసులు, పోలీసు స్టేషన్లకు చేరని అవమానాలు ఇంకెన్నో ఉంటాయి. ఇవి కేవలం సంఖ్యలు కావు. మన సామాజిక ఆరోగ్యానికి వస్తున్న ప్రమాద సంకేతాలు. వ్యవస్థలో న్యాయం జరగడం ఆలస్యమైతే, ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం ప్రారంభిస్తారు. అది నాగరికతకు పతనం ప్రారంభం.కంటికి కన్ను అనే పాతకాలపు పద్ధతి నేడు సోషల్ మీడియా వేదికగా పునరుద్ధరించబడింది. ఒకరు చిన్న తప్పు చేస్తే, దానిని పెద్ద నేరంగా చిత్రీకరించి, వారిని అంతం చేయాలనేంత ద్వేషంతో ప్రతీకారం తీర్చుకోవడం సర్వసాధారణమైంది. ఈ ప్రతీకారతృష్ణ వ్యక్తుల స్థాయి నుండి కమ్యూనిటీల స్థాయికి, అక్కడి నుండి రాజకీయ పార్టీల స్థాయికి విస్తరించింది. న్యాయ వ్యవస్థపై, పోలీసు వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లడం వల్ల, నేనే న్యాయమూర్తిని, నేనే శిక్షకుడిని అనే అహంకారం పెరిగిపోతోంది. ఇది సమాజంలో నిరంతర అశాంతికి దారితీస్తోంది.స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా, మనం ఇంకా కులాల గోడల వెనుక, మతాల కంచెల మధ్యే బందీలుగా ఉన్నాం. అంబేద్కర్, గాంధీ కలలు కన్న సమతా సమాజం, నేటి రాజకీయ నేతల స్వార్థపూరిత సమీకరణాల వల్ల ముక్కలైంది. ఓట్ల కోసం కులతత్వాన్ని, అధికారం కోసం మత విద్వేషాన్ని ఆయుధాలుగా వాడుతున్న నేటి నాయకత్వం, భవిష్యత్తు తరాలకు మనం ఎలాంటి దేశాన్ని ఇస్తున్నామో ఒక్క క్షణం ఆలోచించాలి. యువతలో ఉన్న సృజనాత్మకత, శక్తి సామర్థ్యాలు కులపోరాటాల్లో వృథా అయిపోతున్నాయి. ఇది మన సమాజపు అతి పెద్ద వైఫల్యం.చీకటిని చూసి భయపడటం కంటే, ఒక దీపం వెలిగించడం మిన్న. మనం ఈ దిశగా అడుగులు వేయాలి. పాఠ్యపుస్తకాలలో కేవలం గణితం, విజ్ఞాన శాస్త్రం మాత్రమే కాకుండా, ఎంపథీ (సహానుభూతి), పౌర బాధ్యత, మరియు నైతిక విలువలను బోధించాలి. వార్తలు సమాచారాన్ని అందించాలి, విద్వేషాన్ని పండించకూడదు. బాధ్యతాయుతమైన జర్నలిజం సమాజపు వెన్నెముక. 18-35 ఏళ్ల యువత కుల, మత సంకుచిత వలయాల నుండి బయటకు వచ్చి, భారతీయత అనే ఉమ్మడి గుర్తింపుతో ఆలోచించడం మొదలుపెట్టాలి. చట్టం వేగంగా, నిష్పక్షపాతంగా అమలు జరగాలి. నేరస్థుడికి భయం, బాధితుడికి ధైర్యం కల్పించే వ్యవస్థే అసలైన ప్రజాస్వామ్యం. నాయకులు మారుతారని వేచి చూడటం మానేసి, ప్రజలే తమ పరిసరాల్లో మార్పు కోసం ప్రయత్నించాలి. చిన్న చిన్న నిజాయితీలు గొప్ప ఫలితాలను ఇస్తాయి.నేటి సమాజంలో నిజంగానే చీకటి కమ్ముకుంటోంది, కానీ ఈ చీకటి శాశ్వతం కాదు. చరిత్ర సాక్షిగా, అనేకసార్లు సమాజాలు అంతకన్నా తీవ్రమైన సంక్షోభాల నుండి బయటపడ్డాయి. ఆ మార్పుకు అవసరమైన శక్తి మనలోనే ఉంది. ప్రతి ఒక్కరూ ఒక అడుగు ముందుకేస్తే అది ఒక ఉద్యమం అవుతుంది. మన పిల్లలకు మనం ఇచ్చే అత్యుత్తమ వారసత్వం ఆస్తులు కావు; వారు గౌరవంగా, నిర్భయంగా, నైతికతతో జీవించగలిగే ఒక ఉత్తమ సమాజమే.ఆ సమాజాన్ని నిర్మించడానికి, ఇప్పుడే మనలో మార్పును మొదలుపెడదాం. ఎందుకంటే, మనమే ఆ మార్పుకు కర్తలం, మనమే ఆ భవిష్యత్తుకు నిర్మాణం!



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

## శ్రీ గంగాభవాని కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న

# సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి




**మాజీ ఎంపీపీ,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్త ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి**

**కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముద్దంగుల నరసింహ**

**సంస్థాన్ నారాయణపురం, మే 03(ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం, గంగాభవాని దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ గంగా భవాని కళ్యాణ మహోత్సవము ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి , మాజీ ఎంపీపీ,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముద్దంగుల నరసింహ హాజరై కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని గంగా భవాని దేవాలయ కమిటీ వారు సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ,వార్డు సభ్యులు మందుగుల బాలకృష్ణ,సూరపల్లి వెంకటేష్, సింగపంగ ప్రశాంతి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గునిగంటి రాజు గౌడ్, బద్దుల మురళి యాదవ్, మరగొని శంకర్ గౌడ్, యువజన కాంగ్రెస్ మండల కార్యదర్శి కొండ నవీన్ గౌడ్, బద్దుల యాదగిరి యాదవ్, పెద్దగోనిగిరి గౌడ్, గంగాభవాని దేవాలయ కమిటీ, గంగపుత్ర సంఘం సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# పైలట్లకు విశ్రాంతిపై నిబంధనలు బేఖాతరు

**ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆందోళన**

న్యూఢిల్లీ: పైలట్లకు తప్పనిసరిగా విశ్రాంతి కల్పించేందుకు రూపొందించిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ నిబంధనలు అమల్లోకి రాకపోవడంపై ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తంచేసింది. విమాన ప్రయాణంలో పైలట్లు అనారోగ్యానికి గురవడం, మరణించడం వంటి విషయాలపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కు లేఖ రాసింది. ఇటీవల విధుల్లో ఉండగానే పలువురు పైలట్లు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో విమాన భద్రత, నియంత్రణ, విమాన సిబ్బంది శ్రేయస్సు వంటి విషయాల్లో ఆందోళన వ్యక్తంచేసింది. గతంలో పలు విజ్ఞప్తులు చేసినప్పటికీ.. పైలట్లకు తప్పనిసరిగా విశ్రాంతి కల్పించే నిబంధనలను నిరంతరం వాయిదా వేయడం వల్లే ఈ సమస్యలు తలెత్తుతున్నాయని పైలట్స్ అసోసియేషన్ పేర్కొంది. విమానయాన సంస్థలకు నిరంతరం మినహాయింపు లను మంజూరుచేస్తుండడం ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను నీరుగార్చిందని తెలిపింది. తాత్కాలిక చర్యలుగా ప్రవేశపెట్టిన ఈ సడలింపుల వల్ల పైలట్లకు విశ్రాంతి ఉండట్లేదని పేర్కొంది. దీనివల్ల వారు మానసికంగా, శారీరకంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వెల్లడించింది. ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను వెంటనే అమలుచేయడానికి మార్గదర్శకాలు రూపొందించాలని డీజీసీఏను కోరింది.